

అనపర్తి పోలీసులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

చంద్రబాబు పర్యటన సందర్భంగా అనపర్తిలో ఆయన యాత్రను అడ్డగించిన పోలీసులపై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు సభకు ముందస్తు అనుమతి ఇచ్చి కూడా పోలీసులు చట్టవిరుద్ధంగా రోడ్డుపై వారే బైఠాయించటం, ట్రాఫిక్‌ను ఆటంకపరచడం చట్ట విరుద్ధమన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్ట విరుద్ధంగా వ్యవహరించడం నేరమని, రాజకీయ కక్షతోనే ఇది చేసినట్లుగా ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం ఇలాంటి అప్రజాస్వామిక పనులు మానుకొని ప్రజాస్వామ్యబద్ధంగా అన్ని రాజకీయ పార్టీలూ స్వేచ్ఛగా సభలు జరుపుకోవడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

108 ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- రిఫరల్ కేసులే అత్యధికం
- లక్ష్యం సాధించకుంటే వేధింపులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పని ఒత్తిడి, సెలవులు లేకపోవడంతో 108 సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదు. గట్టిగా నిలదీస్తే పైస్థాయిలో వేధింపులు తప్పడం లేదు.. ఇలా శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా సిబ్బంది సమస్యలతో సతమతమవుతున్నారు. తీరిక లేని విధులతో 108 అంబులెన్స్ సిబ్బంది సతమతం అవుతున్నారు. నాలుగు రోజులకు ఒకసారి ఆఫ్ ఇవ్వాల్సి ఉంది. సిబ్బంది కొరతతో సెలవులు మంజూరు చేయడం లేదు. కనీసం ఆఫ్‌లు ఇవ్వడం లేదు. విరామం లేకుండా విధులు నిర్వహిస్తుండడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. గడచిన 8 నెలల నుంచి వేతనాలు రెండు నెలలకోసారి ఇవ్వటంతో ఆర్థికంగా దెబ్బతింటున్నారు. కుటుంబ పోషణకు కష్టాలు పడుతున్నారు. ఇటువంటి సమస్యలకు పరిష్కారానికి నిరసనలు తెలుపుతున్నా ఫలితం లేకుండా పోతోంది. సిబ్బందిపై వేధింపులు అధికమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నిస్తే అదనపు విధులు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు.

జిల్లాలో 300 మంది ఉద్యోగులు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో 68 వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాల్లో దాదాపుగా 300 మంది వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. ఒక్కొక్క వాహనానికి ఐదుగురు చొప్పున కనీసంగా 340 మంది సిబ్బంది పని చేయాల్సి ఉంది. ఒక మండలంలో వాహనం అందుబాటులోకి లేనట్టయితే మరో మండల వాహనాన్ని పంపుతున్నారు. ప్రతి వాహనానికి నలుగురు సిబ్బంది ఉన్నారు. ఇద్దరు పైలట్‌లు, మరో ఇద్దరు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌లు సేవలందిస్తున్నారు. పగటి వేళల్లో ఇద్దరు, రాత్రి వేళల్లో ఇద్దరు వంతున విధులు నిర్వహిస్తున్నారు. రెండు వాహనాలకు వచ్చేసరికి పది మంది సిబ్బంది ఉండాలి. అంటే నాలుగు రోజులకు ఒకసారి ఆఫ్ ఇచ్చినప్పుడు అదనంగా ఉండే ఇద్దరు సిబ్బంది విధుల్లో ఉంటారు. ప్రస్తుతం రెండు వాహనాలకు 8 మంది సిబ్బందితోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. దానివల్ల ఆఫ్‌లు లేకుండా పోతున్నాయి. సెలవులు ఇవ్వడం లేదు. సిబ్బంది నిత్యం విధుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. తీరిక లేకుండా సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది..

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లాలో 108 సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు విడుదల చేయాలి. కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తిస్తామంటూ గతంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలి. అదేవిధంగా వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించి కండిషన్లో ఉండేట్లుగా చర్యలు చేపట్టాలి. కార్మిక చట్టాలకు అనుగుణంగా 8 గంటల పని విధానం అమలు చేయాలి

- ఎన్.బలరాం, 108 ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు.

రిఫరల్ కేసులే అధికం

ప్రతి మండలంలోనూ 108 వాహనాలు అందుబాటులో ఉండాలి. అత్యవసర సమయాల్లో సేవలందించాలి. ఇప్పుడా పరిస్థితి లేదు. రాజమహేంద్రవరం, అమలాపురం వంటి జిల్లా కేంద్రాల నుంచి ప్రతిరోజూ 5 లేక 6 వాహనాలు కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రి నుంచి రిఫర్ చేసే కేసులకు ఆసుపత్రి సొంత వాహనాలు వినియోగించుకోవాలి. సొంత వాహనాలు లేకపోవడంతో 108లో కాకినాడ పంపుతున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లోని ఆస్పత్రులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రతిరోజు ఒక్కో ఆస్పత్రి నుంచి కనిష్ఠంగా నాలుగు కేసులను కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. ఇలా 108 వాహనాలు ఇప్పుడు రిఫర్ కోసమే ఉపయోగపడుతున్నాయి. ఫలితంగా అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి వాహనం వచ్చేసరికి బాధితులు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఆస్పత్రులకు చేరుకుంటున్నారు.

సకాలంలో అందని వేతనాలు

గతంలో 108 సిబ్బందికి అత్యవసర విభాగాలుగా గుర్తించేవారు. క్రమంతప్పక వేతనాలు మంజూరు చేసేవారు. గడచిన 8 నెలలనుంచి సిబ్బందికి వేతనం సక్రమంగా ఇవ్వడం లేదు. ప్రభుత్వమే నిధులు సమకూర్చకపోవడంతో జీతాలు పడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి 108లో పనిచేసే సిబ్బందికి జూనియర్‌కు రూ.18 వేలు, సీనియర్‌కు రూ.28 వేల వరకు వేతనం ఇస్తున్నారు. అదికూడా రెండు లేక మూడు నెలలకు ఒకసారి చెల్లిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వకపోవడం వల్లే సక్రమంగా వేతనాలు ఇవ్వలేకపోతోంది. దీనిపైనా సిబ్బంది ఒత్తిడి చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

సమస్యలపై పోరాటమే బాలాజీదాస్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కార్మికుల సమస్యలపై పోరాటమే బాలాజీదాస్‌కు ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. శనివారం బాలాజీదాస్ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరంలోని శ్యామలా సెంటర్‌లో ఆయన విగ్రహానికి అరుణ్, పార్టీ సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వర రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అరుణ్ మాట్లాడుతూ జిల్లాలో కార్మికవర్గాన్ని ఐక్యం చేసి, సంఘాలు పెట్టి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై బాలాజీదాస్ పోరాడారని అన్నారు. నాడు విద్యార్థి దశలోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారని, జాతీయోద్యమ స్ఫూర్తితో కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడారన్నారు. రాజమహేంద్రవరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి ఎన్నో పోరాటాలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో కార్మిక నాయకునిగా గుర్తింపు పొందారన్నారు. నేడు అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర పాలకులు కార్మికులు, ప్రజలపై తీవ్ర భారాలు మోపుతున్నారని, ప్రజల సంపదైన ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. పాలకుల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటమే బాలాజీ దాస్‌కు నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, టి.సావిత్రి, రాజమండ్రి నగర కార్యదర్శి బి.పవన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, బిఎస్.ప్రకాష్, బి.సుధ పాల్గొన్నారు.

దళితుల సమాధులపై పార్కింగ్

ప్రజాశక్తి - సీతానగరం



సమాధుల వద్ద బాధితులు

దళితుల సమాధులను బ్లేడు ట్రాక్టర్‌తో దున్ని పట్టిసీమ తిరనాళ్ల యాత్రికుల వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారని వంగలపూడి వాసులు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపైన ఇలాంటి కుల వివక్ష ఏంటని అడిగితే పెత్తందారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. సాంప్రదాయం ప్రకారం ఏటా తమ బంధువుల సమాధుల వద్దకు వెళ్ళి జ్ఞాపకార్థంగా సంవత్సరికాలు చేసుకోవడానికి వీల్లేకుండా 20 సమాధులను తొలగించారని బాధితులు వాపోయారు. కావాలనే పంచాయితీ అధికారులు ఇలాంటి దుర్మార్గానికి పాల్పడ్డారన్నారు. ఈ అన్యాయంపై జిల్లా అధికారులు, పోలీసులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమాధుల రక్షణ కోసం పూర్తిస్థాయిలో రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో అన్ని దళిత సంఘాలతో కలిసి దీక్ష చేపడతామని అన్నారు. ఈ విషయమై ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. మాట్లాడిన వారిలో ఇండిగమెల్లి శ్రీను, ఇండిగమెల్లి వెంకట శ్రీనివాసరావు, ముప్పిడి ప్రభాకర్‌రావు, ఇండిగమెల్లి వెంకటేశ్వర్లు, తవిటికి చిట్టియ్య, తవిటికి కష్ణ, చిడిపి సత్యనారాయణ, చిడిపి బాలకష్ణ, ఇండిగమెల్లి రమేష్, ఇండిగమెల్లి నల్లయ్య, కోడెల్లి శ్రీను, కోడెల్లి కన్నయ్య, చిర్రా వీర్రాజు, ఇండిగమెల్లి బాలాజీ, కుమ్మర చంటి, కోడెల్లి రాముడు, ఇండిగమెల్లి చిన్ని, కోడెల్లి శివ పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన భవాని

చంద్రబాబును కలిసిన ఎంఎల్ఎ భవాని

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పర్యటనను ముగించుకుని తిరుగు ప్రయాణమైన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబును రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవానీ శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు మధురపూడి విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వారితో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం గురించి వివరాలు అడిగి తెలుసుకున్న చంద్రబాబు పలు సూచనలు చేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన నర్సరీ ప్రతినిధులు

ప్రజాశక్తి-కడియం



కేంద్ర మంత్రిని కలిసిన ప్రతినిధులు

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన అధికార నివాసంలో కడియం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లా సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడియం నర్సరీలను ఎకోటూరిజంగా అభివద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉందని, దాన్ని కార్యరూపం దాల్చే విధంగా కషి చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో కడియం నర్సరీల పర్యటనకు వస్తానని, తానే స్వయంగా పరిశీలిస్తానని చెప్పినట్లు నర్సరీ ప్రతినిధులు తెలిపారు.

3000 మందికి మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపురం

హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యుడైన వెల్లంకి జయ శివసూర్యం తన సతీమణి నాగలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా దొండపూడి హెల్పింగ్ హాండ్స్ బస్టాండ్ వద్ద 3000 మందికి శనివారం మజ్జిగ పంపిణీ చేశారుం. ఈ సందర్భంగా వర్తక సంఘం అధ్యక్షులు వెన్న వెంకట్రావు మాట్లాడుతూ శివ సూర్యం దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భమిడిపాటి శ్రీను, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మారాజు రాజేష్, నున్న అనంత మణికుమార్, షేక్ మస్తాన్, కొమ్మన ప్రసాద్, మల్లిపూడి శ్రీను, వెల్లంకి శివ, నగరగంటి వాసు, హుస్సేన్, మాబు తదితరులు పాల్గొన్నారు.

దోసకాయలపల్లిలో విషాద ఛాయలు

ప్రజాశక్తి-కోరుకొండ



దుర్ఘటనలో మరణించిన యువకులు

మహాశివరాత్రి సందర్భంగా స్నేహితులతో కలిసి పట్టిసీమ తీర్థానికి వెళ్ళిన దోసకాయలపల్లి గ్రామానికి చెందిన ఓలేటి అరవింద్(20), ఎస్‌కె.లుక్మన్ (19), పెద్దిరెడ్డి రాంప్రసాద్ (18) గోదావరిలో స్నానానికి వెళ్లి ప్రవాహంలో మునిగి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వీరిలో అరవింద్ గ్రామంలో బేకరీ నిర్వహిస్తుండగా లుక్మన్, రాంప్రసాద్ ఐటిఐ చదువుతున్నారు. సంఘటన విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎంఎల్ఎ జక్కంపూడి రాజా సహాయక చర్యలకు ఆదేశించారు. గజ ఈతగాళ్ళు గాలింపు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. ముగ్గురు యువకులు మతి చెందడంపట్ల ఎంఎల్ఎ రాజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కోరుకొండ జెడ్‌పిటిసి క్రరి నాగేశ్వరరావు, కొండపల్లి దుర్గారావు సంఘటనాస్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

క్రీడాకారులకు భరత్ బాబు అభినందన

ప్రజాశక్తి - దేవరపల్లి

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని యర్నగూడెం సర్పంచ్ బొంత భరత్‌బాబు అన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన సపక్ తక్రా అండర్ 14 ఎస్‌జిఎఫ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. వారికి ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివద్ధి కమిటీ చైర్మన్ దూళిపూడి రవీంద్ర, ఫిజికల్ డైరెక్టర్లు తలారి సరస్వతి, ఆచంట వెంకటేశ్వరరావు, పాకా సతీష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో సర్వే చేస్తున్న సిబ్బంది


డ్రోన్‌తో బయో మందు పిచికారీ

ప్రజాశక్తి-పెరవలి

పిట్టలవేమవరంలోని వరి క్షేత్రంలో 18 రకాల బయోకల్చర్ ద్రావణాన్ని శనివారం డ్రోన్ సాయంతో వరిపొలాల్లో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ మహేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతీ రైతు అవలంబించాలన్నారు. ఈ మధ్యకాలంలో ఎక్కువమంది రైతులు ప్రకతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. యూనిట్ ఇన్‌ఛార్జి బుజ్జి మాట్లాడుతూ పిట్టలవేమవరంలో అనేక మంది రైతులు బయోకల్చర్స్ ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు విద్యాలత రత్నరాజు, మహేష్, ప్రసాద్, రవి, శేఖర్ రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష తేజం చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి

ప్రజాశక్తి-కడియం



కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, విద్యార్థులు

తన రచనల ద్వారా తెలుగు భాషను పరిపుష్టం చేసిన మహాకవి చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి తెలుగు భాషా తేజమని కళాసేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తిరుపతి వేంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల 73వ వర్ధంతి శనివారం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, గౌరవ అధ్యక్షులు తోరాటి వసంతరావు జంట కవుల విగ్రహాలకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమితి కార్యవర్గం చిక్కాల ఈశ్వరరావు, బోణం సత్యనారాయణ, తమ్మిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ తమ నాటకాలు, అవధానాలు, రచనల ద్వారా తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన జంట కవుల విగ్రహాలు రాజధానిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఉంగరాల వీరభద్రరావు, ఆకుల సూర్యనారాయణ, బొర్రా రామకష్ణ, క్రరి రాజు, డిటివిఎస్.నాగేంద్ర, గొల్లపల్లి సత్యనారాయణ, ఎండిఎ.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో ఆదిరెడ్డి వాసు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుప్పం నుంచి చేపట్టిన యువగళం పాదయాత్ర శ్రీకాళహస్తికి చేరుకుంది. 22వ రోజుకు చేరుకున్న ఆ పాదయాత్రలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ లోకేష్‌ను కలిసి ఆయన ముఖ చిత్రంతో ఉన్న ఫొటో ఫ్రేమ్‌ను అందజేశారు. అనంతరం లోకేష్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా లోకేష్ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం గురించి వాసుకి పలు సూచనలు చేశారు. అనంతరం వాసు మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. టిడిపికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ, చంద్రబాబు పర్యటనలు, లోకేష్ పాదయాత్రను చూసి ఓర్వలేని ముఖ్యమంత్రి జగన్ దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన తమ అధినాయకులు చంద్రబాబు నాయుడు అనపర్తిలో సభలో ప్రసంగించేందుకు వెళుతుండగా పోలీసులతో అడ్డుకోవడం హేయమైన చర్యన్నారు.

కార్టూ'నిజం'



కబ్జాలకు.. లేదా తాకట్టుకు
ఏమైనా అవకాశం ఉంటుందని..!!

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదానాలు ఏర్పాటు చేశారు. యాత్రిలకు నదీస్నానాలు చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్ రామ్ పలు శివాలయాల్లో పూజలు చేశారు. ఎంపీ తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన, ఎంపీ భరత్, మోనా దంపతులకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో రామసాయి దీప్, కొత్తా బాల మురళి, మింది నాగేంద్ర, డబ్బింగ్ రమేష్, అన్నపూర్ణ రాజు, పిట్టా రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. పుష్కరాల రేవులో రుడా ఛైర్పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి యాత్రికులతో కలిసి గోదావరి స్నానం చేశారు. **కొవ్వూరు రూరల్‌లో** గోష్పాద క్షేత్రం వద్ద సుమారు 1000 మంది స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అక్షయపాత్ర చారిటబుల్ ట్రస్ట్, అవంతి పరిశ్రమ యాజమాన్యం, ఇతర స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు పాలు, పులిహోర వంటివి అందజేశారు. **ఉండ్రాజవరం** మండలం పాలంగిలోని రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని కొవ్వూరు ఆర్‌డిఒ మల్లిబాబు దర్శించుకున్నారు. దర్శించుకున్న ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, ఆలయ ఛైర్మన్ దొద్దా సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, వైసిపి నాయకులు శరత్, తహశీల్దార్ జి.కనకరాజు, పెరవలి తహశీల్దారు రాజరాజేశ్వరి తదితరులు ఉన్నారు. **పెరవలి** మండలం తీపర్రులో రాజరాజ నరేంద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ ఇంటి వద్ద ఆరు కౌంటర్లు ఏర్పాటుచేసి సుమారు 20 వేల మందికి అన్నదానం చేశారు. **తాళ్లపూడి** ప్రక్కిలంక భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద 2000 మందికి అల్పాహారం, వెయ్యి మందికి పాలు, మధ్యాహ్నం 4000 మందికి అన్నదానం సాయంత్రం 300 లీటర్ల చల్లని కూల్ డ్రింక్స్ అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సొలస కాశీ విశ్వనాథం, కార్యదర్శి గిరిధర్ గాంధీ పాల్గొన్నారు. ప్రక్కిలంక ఘాట్ వద్ద సొలస శ్రీరామచంద్రమూర్తి కస్తూరి, పువ్వాడ రత్నకుమారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నాలుగు వేల లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. **నిడదవోలు** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీ సమేత గొలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద పాలు, బిస్కెట్స్, లడ్లు, వాటర్ పాకెట్స్ పంపిణీ చేశారు. కోట శివరామకృష్ణ, చక్కా రవికుమార్, గుప్తా, మానేపల్లి వెంకటరమణ, కేదారిశెట్టి రవికుమార్, వలివేటి వెంకట సుబ్బారావు, ఆలమూరి రాజశేఖర్, కొణిజేటి సురేష్, బచ్చు లక్ష్మణరావు, కేదారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, గెల్లి సత్యనారయణ, గమిని నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కొవ్వూరులోని గోష్పాద క్షేత్రంలో..



రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్ వద్ద..

40 వేల మందికి భారీ అన్నదానం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంకలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 73వ వార్షికోత్సవ సందర్భంగా 40 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భారీ బాణసంచా, దేవతామూర్తుల అలంకరణలు, బ్యాండ్ మేళాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు గ్రామస్తులను ఆద్యంతం అలరించాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ పల్ల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. కడియం సిఐ తిలక్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారిని రాజమహేంద్రవరం రూరల్ వైసిపి కో ఆర్డినేటర్ చందన నాగేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అతిథులను ఆలయ కమిటీ తరపున ఛైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించి, మెమెంటోలను అందజేశారు.

నేరాలు ఘోరాలు



వీరేంద్ర మృతదేహం

గోదావరిలో మునిగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

శివరాత్రి సందర్భంగా గోదావరిలో స్నానం చేసేందుకు గోదావరిలో దిగి ఈత రాక మునిగిపోవడంతో విద్యార్థి మృతి చెందాడు. వివరాలు ఇవి.. కె.గంగవరం మండలంలోని అద్దంపల్లి గ్రామానికి చెందిన పంపన శశి వీరేంద్ర (14) తన స్నేహితులతో కలిసి శివరాత్రికి గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. కోటిపల్లి చెంతనే గల పాత కోట గ్రామం వద్ద గోదావరిలో దిగి లోతు ఎక్కువ గా ఉండటం తో మునిగి పోయాడు. ఇతనితో పాటు మెడి శెట్టి మణికంఠ కూడా మునిగిపోగా అతనిని రక్షించి రామచంద్ర పురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. 9 వ తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందడంతో అద్దంపల్లి లో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితులను అరెస్టు చేసిన దృశ్యం

22 కేజీల గంజాయి స్వాధీనం నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం జే తిమ్మాపురం గ్రామంలో శనివారం డివిజనల్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. అనంతరం డిటిఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ దాడుల్లో భాగంగా ఒక మోటార్ బైక్ ను, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏజెన్సీ నుంచి పెద్దాపురం పరిధిలో గంజాయిని రప్పించి ఇక్కడ నుంచి రైలు మార్గం ద్వారా గంజాయిని చెన్నై తరలిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు మూడు రోజులుగా నిఘా వేసి వీరిని పట్టుకున్నామన్నారు. ఈ దాడుల్లో తమిళనాడులోని దిండిగల్లుకు చెందిన రాజేష్ ఖన్నా, ఏజెన్సీలోని కేడి పేటకు చెందిన శివంగి నూకరాజు, జె.తిమ్మాపురానికి చెందిన పిల్లి వెంకటరమణ, రామలక్ష్మిలను అరెస్టు చేశామన్నారు. డిటిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె.విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పేకేటిపాకల్లో కాలి బూడిదైనా పశువుల పాక

పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని తాపేశ్వరం శివారు పేకేటిపాకల తుల్యభాగ మేజర్ డ్రెయిన్ గట్టున ఉన్న పశువులపాక శుక్రవారం రాత్రి దగ్ధం కావడంతో ఒక గేది పాక్షికంగా కాలిపోయింది. ఈ ఘటనలో పశువులపాక పూర్తిగా కాలిపోయి బూడిదయ్యింది. దీంతో సుమారు రూ.50 వేల నష్టం వాటిలిందని గ్రామానికి చెందిన పశుపోషకుడు వాసంశెట్టి లక్ష్మణ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ బంధువే ఈ పని చేశాడని గతంలోనూ ఇంటి గేట్లు పగల గొట్టడాని అతడు చెబుతున్నాడు. రాత్రి గ్రామ ప్రజలంతా మంటలను అదుపు చేశారని దీంతో రెండు గేదులు సురక్షితంగా బయటపడ్డాయని ఈ సంఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని అతడు అంటున్నాడు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడికి చెందిన షేక్ జైన్ తమ కుమార్తె కనిపించడం లేదని సీతానగరం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 16 నా ఉదయం పది గంటలకు సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామం శ్రీరామ్ నగర్ కాలని కి చెందిన షేక్ జైన్ తన కుమార్తె షేక్ ఉషేన్ బీబీ అదే కాలనీలో పొరుగింటి అనువర్షను కలవడానికి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. జైన్ తన కుమార్తె కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. తన కుమార్తె అదృశ్యం వెనుక గొర్రెల మణికంఠ అనే వ్యక్తి పై అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు రోడ్ షోను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య

ప్రజాశక్తి -కొత్తపేట

మాజీ సిఎం నారా చంద్రబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మూడు రోజులు పర్యటనలో భాగంగా ఈనెల 17న అనపర్తి విచ్చేసిన ఆయన రోడ్డు షోను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని టిడిపి జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి విమర్శించారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తోందన్నారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛ, హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్న వైసిపి ప్రభుత్వం ప్రజా ఆగ్రహానికి గురి కాక తప్పదని ఆమె హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వ పాలనపై అసంతృప్తితో తెలుగుదేశం పార్టీ సభలు, సమావేశాలకు జనం అత్యధికంగా విచ్చేస్తున్నారని అన్నారు.



విపక్షాల మెడపై కత్తి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు విపక్షాల మెడపై కత్తిపెడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిఒ నెం.1 పేరుతో ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాలపై ఆంక్షలు విధిస్తున్న విషయం విదితమే. ఈ జిఒకు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గడంలేదు. తాజాగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చేపట్టిన ఇదేం ఖర్మ కార్యక్రమం రణరంగంగా మారింది. పోలీసులు అడ్డుకోవటం, ఆ పార్టీ శ్రేణులతో పాటు చంద్రబాబు ఏడు కిలో మీటర్లు కాలినడకన వెళ్లి సభ నిర్వహించటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు సభ నిర్వహించేదుకు పోలీసు అధికారులు తొలుత అనుమతులు ఇచ్చారు. జగ్గంపేట, సామర్లకోటలలో ఇదేం ఖర్మ కార్యక్రమం సజావుగా జరిగినప్పటికీ అనపర్తిలో సభ నిర్వహించుకునేందుకు అర్ధాంతరంగా రద్దు చేయటం, యాత్రను అడ్డుకునేందుకు కొందరు పోలీసులు రోడ్డుపై బైఠాయించటం వంటి పరిణామాలు పోలీసు వ్యవస్థ తీరుపై విమర్శలకు దారి తీసింది. తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలతో పాటు ఏకంగా 1000 మందిపై కేసులు నమోదు చేయటం వంటి పరిణామాలు ప్రజలను, ప్రజాస్వామ్యవాదులను భయాందోళనకు గురి చేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

● కొనసాగుతున్న పేపరు మిల్లు కార్మికుల దీక్షలు

ఆంధ్ర పేపరు మిల్లు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. కార్మికుల ఆందోళనలకు వామపక్ష పార్టీలతో పాటు ఇతర ప్రజా, ఉద్యోగ సంఘాలు ఒకొక్కటిగా మద్దతు తెలుపుతున్నాయి. పేపరు మిల్లు యాజమాన్యం పారిశ్రామిక చట్టాలను సైతం తూట్లు పొడిచి కొద్ది మంది అక్రమార్కుల సూచనలతో అక్రమాలకు తెరలేపిన విషయం విధితమే. ఈ పరస్థితిని చక్కదిద్ది కార్మికుల తరుపున నిలవాల్సిన ప్రజా ప్రతినిధులు భిన్నంగా వ్యవహరించటం విమర్శలకు దారి తీస్తోంది. కామ్రెడ్ బాలాజీదాస్, బి.బి నాయుడు వంటి నాయకులు సారధ్యంలో పేపరు మిల్లులో అనేక సమరశీల పోరాటాలు నిర్వహించారు. ఆ నేతల స్ఫూర్తితో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు కార్మిక సంఘాల నేతలు స్పష్టం చేశారు.

● బకాయిల కోసం ధాన్యం రైతుల ఎదురు చూపులు

జిల్లాలో ధాన్యం బకాయిల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. నూతన సాంకేతిక విధానంతో రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని అధికార యంత్రాంగం ప్రకటనలు గుప్పించిన విషయం విధితమే. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. అవరాలకు తగ్గట్లుగా గన్నీ సంచులు అందుబాటులో లేకపోవటం, సాంకేతిక సమస్యలు వంటివి వెంటాడాయి. ప్రభుత్వ అనుసరించిన నిబంధనల అడ్డుగోడలను దాటికి ధాన్యం విక్రయించిన రైతులు ప్రస్తుతం నగదు కోసం ఎదురు చూస్తున్నారు. కేవలం 21 రోజులలో బకాయిలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టలేదు. అత్యధిక మండలాల్లో తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో కొన్ని చోట్ల ధాన్యం తిరస్కరించటంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పలేదు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. అధికారులు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ గత పరిస్థితులే పునరావృతం అయ్యాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మ్యాచ్ లో తలపడుతున్న మణిపూర్- ఢిల్లీ జట్లు



హోరాహోరీ తలపడుతున్న ఉత్తరాఖండ్ - జార్ఖండ్ జట్లు

ఉల్లాసంగా హాకీ పోటీలు

- లీగు దశలోనే ఇంటి బాట పట్టనున్న అండమాన్ మరి కొన్ని రాష్ట్రాలు
- ఆసక్తికరంగా సాగుతున్న ఇండియా సీనియర్ మహిళ హాకీ పోటీలు
- 3వరోజు మ్యాచ్‌లో మహారాష్ట్ర, మణిపూర్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక జట్లు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ మైదానంలో 13వ ఇండియా సీనియర్ మహిళల జాతీయ ఛాంపియన్షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం మొదటి మ్యాచ్ కర్ణాటక - గోవా మధ్య జరగా, కర్ణాటక జట్టు గోవా జట్టుకు అవకాశం ఇవ్వకుండా నిర్దేశిత సమయంలో10 గోల్స్ వేసి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కర్ణాటక జట్టుకు చెందిన చందన ఎంపికయింది. అనంతరం ప్రారంభమైన హర్యానా -బీహార్ జట్ల మధ్య ఆసక్తికరంగా మ్యాచ్ కొనసాగింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా హర్యానా జట్టుకు చెందిన అమన్ దిలీప్ ఎంపికైంది. మణిపూర్ జట్టు ఢిల్లీ జట్టును ముచ్చె మటలు పట్టించి పూర్తి అధిపత్యాన్ని కనబరుస్తూ 9 గోల్స్ సాధించింది. ఢిల్లీ జట్టు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకో కుండా వధా చేసు కోవడంతో ఒక్క గోలు కూడా సాధించకుండానే మ్యాచ్‌ను ముగించింది. జార్ఖండ్ - ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా జరిగిందని చెప్పాలి. ఉత్తరాఖండ్ జట్టుపై 13 గోల్స్ చేసి జార్ఖండ్ టీం విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా జార్ఖండ్ జట్టు అల్‌బిలా రాణి ఎంపికయింది. ఢిల్లీ - మణి పూర్ మధ్య జరిగిన మ్యాచ్ చివరి వరకు పూర్తి రసవత్తరంగా జరిగింది. ఢిల్లీ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకపోవడంతో, మణిపూర్ కు 4 గోల్స్ సమర్పించుకుంది. చివరి వరకు పోరాడిన ఢిల్లీ ఎటువంటి గోల్స్ సాధించకుండానే మ్యాచును ముగించగా మణిపూరి టీం విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా మణిపూర్‌కు చెందిన సోనియా దేవి ఎంపికయింది. మహారాష్ట్ర అండమాన్ నికోబార్ టీముల మధ్య జరిగిన మ్యాచ్ పూర్తి ఏకపక్షంగా జరిగిందని చెప్పాలి. మైదానంలో మహారాష్ట్రకు అవకాశాల మీద అవకాశాలు ఇస్తూ ఏకంగా 42 గోల్స్ సమర్పించుకుంది. దీంతో లీగు దశలోనే ఇంటి బాట పట్టేందుకు అండమాన్ టీమ్స్ సిద్ధమైంది. మరికొన్ని టీములు భవితవ్యం రేపు తేలనుంది



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందుకుంటున్న అమన్‌దీప్ కౌర్

నేటి మ్యాచ్ వివరాలు

ఉదయం 7:00: పంజాబ్- హిమాచల్
ఉదయం 8:45 : ఉత్తర ప్రదేశ్ - ఆంధ్రప్రదేశ్
సాయంత్రం 3:45: అస్సాం- బీహార్



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు

36 పరీక్షా కేంద్రాల్లో రాత పరీక్ష

- హాజరు కానున్న16,750 మంది ఎస్ఐ అభ్యర్థులు
- పటిష్ట బందోబస్తుతో ఏర్పాట్లు - ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 19వ తేదీ ఆదివారం పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లపై జిల్లా ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు జూమ్ సమావేశంలో జిల్లాలోని పోలీసుల అధికారులతో పరీక్షా కేంద్రాల వద్ద తీసుకుంటున్న భద్రతాపరమైన చర్యలు అభ్యర్థుల సౌలభ్యం కొరకు చేసిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 36 పరీక్షా కేంద్రాలలలో మొత్తం 16750 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మొదట పేపరుకు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండవ పేపర్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్ష ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 9గంటల నుండి పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తారన్నారు. నిర్దేశిత సమయాని కన్నా ముందే పరీక్షా కేంద్రానికి చేరుకునేలా అభ్యర్థులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని ఎస్‌పి సూచించారు.

పరీక్షా సమయానికి ఉదయం 10.30 గం. తరువాత అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గం తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి పరీక్ష రాసేందుకు అనుమతించ బడదన్నారు. పరీక్షకు ప్రతి ఒక్క అభ్యర్థిని పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతిస్తారని, అభ్యర్థులు తమ హాల్ టికెట్లతో పాటు ఒక ఫొటో గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సంబంధిత కళాశాల మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మొబైల్, బ్యాగేజ్ కౌంటర్ల ఏర్పాటు చేఉస్తున్నట్టు , ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా హాల్‌లోనికి అనుమతించబోరని స్పష్టం చేశారు.

పరీక్ష రాసిన తర్వాత పరీక్ష సమయం ముగిసిన తర్వాతనే బయటకు పంపుతారని, పరీక్షలకు సంబంధించి ఏ విధమైన అవకతవకలకు పాల్పడినా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అభ్యర్థుల సౌలభ్యం కోసం ఎపి ఎస్‌ఆర్‌టీసీ ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని ప్రాంతాలనుండి బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సౌకర్యాన్ని అభ్యర్థులు వినియోగించు కోవచ్చున్నారు.

మహిళా అభ్యర్థులను చెకింగ్ చేయు నిమిత్తం తగిన మహిళా పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పశాంత వాతా వరణంలో అభ్యర్థులు అందరూ కేంద్రాలలో పరీక్ష రాసేందుకు తగిన భద్రతా పరమైన చర్యలు, తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ సూచించారు. ఏపీ ఎస్ ఎల్ పీ ఆర్‌బీ నిర్దేశాల ప్రకారం పరీక్ష కేంద్రాల లోనికి అభ్యర్థులు, పరీక్షల నిర్వహణ సిబ్బందిని మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు అనుమతి ఉండదని. ఈ విషయం అందరూ గ్రహించి సహకరించాలన్నారు. జూమ్ సమావేశంలో ఎఎస్‌పిలు పి శ్రీనివాస్, డి.ఎస్.పిలు ఎం.అంబికా ప్రసాద్, పి మురళీకష్ణారెడ్డి, ఎస్.మురళీమోహన్, వెంకట అప్పారావు, జిల్లాలోని సీఐ, ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు హాజరయ్యారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : NARSIPATNAM
O.S.No. 112/2022

Between:
Seeram RajKumar ***...Plaintiff***
AND
Alluri Manikya Bramaramba ***...Defendant***

TO:
Alluri Manikya Bramaramba, W/o. SatyanarayanaMurthy, Age 58 Years, R/o. D.No. 3-111, Near Gokulam, Maduranagar, S.Atchuthapuram, Kakinada, E.G.District.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.09-03-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా మీకు పరోక్షమున తీర్మానించబడును.

వి.ఎస్.వి.వి.శ్రీరామమూర్తి
అడ్వకేట్, కాకినాడ.
కె.ఆర్.వి.సత్యనారాయణ
అడ్వకేట్, నర్సీపట్నం.

భవిష్యనిధికి ఎదురు తెన్నులు

- ఒక్క జిల్లా పరిషత్ పరిధిలోనే 1420మంది ఉద్యోగులకు 61.77 కోట్లు
- వేర్వేరు శాఖల ఉద్యోగులకు మరో రూ.50 కోట్లు
- దరఖాస్తులు సిఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌కు అప్లోడ్ చేసినా బ్యాంకు ఖాతాల్లో జమ కాని నగదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భవిష్యనిధి (సీఎఫ్) నుంచి రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. గడచిన ఆరేడు నెలలుగా ఒక్కరికి కూడా డబ్బులు అందలేదు. గత ఏడాది మే నుంచి జిల్లా పరిషత్.. యాజమాన్యం పరిధిలో పనిచేస్తున్న 1420 మంది పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ.61.77 కోట్లు విడుదల రాలసి ఉంది. వీరు కాకుండా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులకు మరో రూ.50 కోట్లకుపైగా అందాల్సి ఉందంటున్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతం నుంచి ప్రతి నెలా కొంత మొత్తం భవిష్యనిధి (పీఎఫ్)కి జమ అవుతుంది. సదరు ఉద్యోగి తన సర్వీసులో ఎప్పుడైనా సరే అందులో నుంచి కొంత మొత్తం సొంత అవసరాలకు డ్రా చేసుకునే వెసులుబాటు ఉంది. ఇలా తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించ నక్కర్లేదు. దీనిని పార్టు ఫైనల్ అని అంటారు. ఇది కాకుండా రుణంగా తీసుకుని ప్రతి నెలా చెల్లించే విధానం ఉంటుంది. కుటుంబ అవసరాలు అంటే వైద్యం, ఇంటి కొనుగోలు, మరమ్మతులు, పిల్లల ఉన్నత చదువులు, వివాహాలు కోసం పీఎఫ్ నుంచి డబ్బులు తీసుకుంటారు. సాధారణంగా ఉన్నత చదువుల కోసం అయితే మూడు నెలల మూల వేతనం, ప్రత్యేక పరిస్థితులైతే పది నెలల మూలవేతనం రుణంగా తీసుకోవచ్చు. అలాగే వైద్య అవసరాల కోసం ఆరు నెలల మూల వేతనం, ప్రత్యేక పరిస్థితుల్లో దాచుకున్న మొత్తం నుంచి నాలుగింట మూడు వంతులు, కుమార్తె వివాహమైతే ఆరు నెలల మూల వేతనం, ప్రత్యేక పరిస్థితుల్లో అయితే పది నెలలు, కుమారుడి పెళ్లికి మూడు నెలలు, ప్రత్యేక పరిస్థితుల్లో ఆరు నెలల మూల వేతనం డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. కొత్తగా ఇంటి కొనుగోలుకు మొత్తం దాచుకున్న సొమ్ములో నాలుగింట మూడు వంతులు, మరమ్మతులకు రూ.రెండు లక్షల వరకు డ్రా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. : అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పీఎఫ్ రుణాలు విడుదలలో తీవ్ర జాప్యం -నెలకొంది. తొలి రెండేళ్లు నెలల తరబడి కాలయాపన జరిగేది. 2021లో కొద్దికొద్దిగా ఇవ్వడం ప్రారంభించారు. అలా 2022 ఏప్రిల్ వరకు పీఎఫ్ సొమ్ములు విడుదల చేసిన ప్రభుత్వం అప్పటి నుంచి మళ్లీ పెండింగ్లో పెట్టేసింది. గత ఏడాది మే నుంచి డిసెంబరు వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో 1420 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి రూ. 61,77,22,000 విడుదల కావలసి ఉంది. వీటిలో సగం దరఖాస్తులు ఆన్లైన్లో అప్లోడ్ చేయగా ...మిగిలినవి ఇంకా చేయాల్సి ఉంది. పీఎఫ్ విడుదలపై జడ్‌పి కార్యాల యానికి వచ్చి ఒత్తిడి తెచ్చినా ఇక్కడ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దరఖాస్తులను సీఎఫ్‌ఎంఎస్ పోర్టలు అప్లోడ్ చేసినా ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ కావడంలో తీవ్ర జాప్యం చోటుచేసు కుంటోంది. కాగా పీఎఫ్‌కు సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల దర ఖాస్తులు ట్రెజరీ కార్యాలయం నుంచి సీఎఫ్‌ఎంఎస్ పోర్టల్ అప్లోడ్ చేస్తూం టారు. ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరేడు వందల మందికి రూ.50 కోట్ల వరకు విడుదల చేయాల్సి వుంటుందని ట్రెజరీ ఉద్యోగులు. చెబుతున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చిన తరువాత ఎప్పటికప్పుడు దరఖాస్తులు అప్లోడ్ చేయ డమే తప్ప జిల్లా స్థాయిలో పక్కా రికార్డు వుండదని ఒక ఉద్యోగి వివరించారు.

<u>దావా సమన్లు</u>
మహారాజశ్రీ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
<u>ఓ.ఎస్.నెం. 109/2019</u>

<u>బిట్వీన్:</u>
భేరి హరికృష్ణ **...వాది**
అండ్
వడ్డి మురళీ @ నక్కా బాలమురళీ కృష్ణ వగైరాలు **...ప్రతివాదులు**

టు:
డి-1: నక్కా బాలమురళీకృష్ణ @ వడ్డి మురళీ తండ్రి: వడ్డి సూర్యారావు @ నక్కా బాలకృష్ణ, నక్కా వారి పేట, ముమ్మిడివరం.

ఈ పై నెంబరు దావాలో 1వ ప్రతివాది తన వాదనను దాఖలు చేసుకొని ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు **ది.22-02-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా కాని, వకీలు ద్వారా గాని హాజరు కావలసియున్నది.** లేని ఎడల ఈ దావాను మీ పరోక్షమందు విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

నడింపల్లి సత్యనారాయణ రాజు
ముమ్మిడివరం, అడ్వకేట్, ముమ్మిడివరం.
18-02-23. సెల్: 94401 12512

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వ్యక్తిని బెదిరించి, గాయపరిచి చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రాజమహేంద్రవరం మూడవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. బాధితునిది సీతానగరం మండలం ఉండేశ్వరపురం. అతను రాజమహేంద్రవరం దానవాయిపేటలో గల ముతూట్ ఫైనాన్సులో నందు బంగారం తనిఖీ పని చేస్తున్నాడు. ఈ నెల 15న రాత్రి తన స్వగ్రామానికి మోటార్ సైకిల్ పై వెళుతున్నాడు. అయితే కాతేరు గ్రామ శివారు గామన్ బ్రిడ్జి రోడ్ దగ్గరలో గల ఎస్సార్ పెట్రోల్ బంకు ఎదురుగా ఖాళీ స్థలం వద్దకు వెళ్లేసరికి కాలకృత్యాల నిమిత్తం మోటార్ సైకిల్‌ను నిలిపాడు. ఇంతలో ఇద్దరు వారి మోటార్ సైకిల్‌పై బాధితుని వద్దకు వచ్చి కత్తులతో బెదిరించారు. బాధితుని మెడలోని బంగారం గొలుసు, అతని సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. అనంతరం బాధితుని చాకుతో గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల పైఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పటిష్టమైన నిఘాతో దర్యాప్తుచేపట్టారు. దర్యాప్తు లో భాగంగా ప్రత్యేక సమాచారం పై కోటిలింగాల ఘాట్ వద్ద నిందితులైన ఖమ్మం జిల్లాకు చెందిన బత్తుల మరేశ్వరరావు, తురక కొండలరావు (కోటిలింగాల పేట) అరెస్ట్ చేసి వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు.



పూర్తికాని అప్రోచ్ రోడ్డు

అసంపూర్తిగా అప్రోచ్ రోడ్డు పనులు

ప్రజాశక్తి-మండపేట

పట్టణ ముఖ ద్వారం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడంలో భాగంగా పెద్దకాలువ వంతెన చెంతనే నిర్మించిన రెండవ వంతెనకు ఇరువైపులా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులు ఏళ్లు గడుస్తున్న పూర్తికాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రూ.86 లక్షల అంచనాలతో గోదావరి డెల్టా ఆధునీకరణలో భాగంగా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులకు ఇప్పటి వరకు రూ.60 లక్షల నిధులను ఖర్చు చేశారు. మిగిలిన రూ.11 లక్షలకు పనులు జరగాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో వంతెన నిరూపయోగంగా మారిడంతో వాహనదారులు ఒక వైపు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో తరచు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుచున్నారు.

ఈ విషయంపై రామచంద్రపురం సెక్షన్ ఎఇ నాగరాజును వివరణ కోరగా అప్రోచ్, బిటి రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉందని కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఈ పనికి సంబంధించిన అగ్రిమెంటు పూర్తి అయిందన్నారు.

<u>ప్రకటన</u>
మహారాజశ్రీ గౌరవనీయ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
ఐ.ఎ.నెం. 166/2022
<u>**ఓ.ఎస్.నెం. 144/2022**</u>

<u>బిట్వీన్:</u>
1) బద్ది మునిబాల, భర్త: భావన్నారాయణ, పెద్దనాపల్లి గ్రామం, ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా.
2) సుంకర దుర్గాదేవి, భర్త: మంగరాజు, ఒమ్మంగి గ్రామం, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా.
...పిటీషనర్లు
మరియు
1) గొల్లపల్లి నరసింహమూర్తి, తండ్రి: అచ్యుతరామారావు.
2) గొల్లపల్లి సుబ్రహ్మణ్యం, తండ్రి: అచ్చుతరామయ్య.
ఇద్దరిదీ పెద్దనాపల్లి గ్రామం, ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా. **...రెస్పాండెంట్లు**

గౌరవనీయ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో రెస్పాండెంటులపై పిటీషనర్లు పై సివిల్ దావాను వేసినారు. కోర్టు వారి నుండి ఎన్నిసార్లు రెస్పాండెంటులకు నోటీసులు పంపినా తీసుకొనక కాలయాపన చేస్తున్నారు. కావున ది.17-03-2023 వ తేదీన పై కోర్టులో పై కేసు వాయిదాకు ఉన్నది. రెస్పాండెంట్సు అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **ది.17-03-2023 ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియజేయవలెనని,** లేని ఎడల పరోక్షమున కేసు తీర్మానించబడునని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

బుగత వెంకటశివన్నారాయణ
అడ్వకేట్, డో.నెం. 9-4,
ప్రత్తిపాడు. సెల్: 98490 64436

<u>ప్రకటన</u>
మహారాజశ్రీ గౌరవనీయ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
<u>**ఓ.ఎస్.నెం. 144/2022**</u>

<u>బిట్వీన్:</u>
1) బద్ది మునిబాల, భర్త: భావన్నారాయణ, పెద్దనాపల్లి గ్రామం, ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా.
2) సుంకర దుర్గాదేవి, భర్త: మంగరాజు, ఒమ్మంగి గ్రామం, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా.
...వాదులు
మరియు
1) గొల్లపల్లి నరసింహమూర్తి, తండ్రి: అచ్యుతరామారావు.
2) గొల్లపల్లి సుబ్రహ్మణ్యం, తండ్రి: అచ్చుతరామయ్య.
ఇద్దరిదీ పెద్దనాపల్లి గ్రామం, ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా. **...ప్రతివాదులు**

గౌరవనీయ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ప్రతివాదులపై వాదులు పై సివిల్ దావాను వేసినారు. కోర్టు వారి నుండి ఎన్నిసార్లు సమన్లు పంపినా ప్రతివాదులు తీసుకొనక కాలయాపన చేస్తున్నారు. కావున ది.17-03-2023వ తేదీన పై కోర్టులో పై కేసు వాయిదాకు ఉన్నది. ప్రతివాదులు అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **ది.17-03-2023 ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియజేయవలెనని,** లేని ఎడల పరోక్షమున కేసు తీర్మానించబడునని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

బుగత వెంకటశివన్నారాయణ
అడ్వకేట్, డో.నెం. 9-4,
ప్రత్తిపాడు. సెల్: 98490 64436